ప్రజాశక్తి
ఆదివారం 28 జనవరి 2024
5
విజయనగరం

టెన్నిస్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నం వాల్తేరు రైల్వే స్టేషన్ స్టేడియంలో నిర్వహించిన డిఆర్ఎం కప్ ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ 45ప్లస్ డబుల్స్ విభాగంలో విజయనగరానికి చెందిన సుదర్శన్ రాజు, ఎంవిఎల్ఎన్ రాజు విజేతలుగా నిలిచారు. ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు విశాఖలో ఈ పోటీలు కొనసాగాయి. 45 ప్లస్ డబుల్స్ విభాగంలో విజేతలు సుదర్శన్ , ఎంవిఎల్ఎన్ రాజులను ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు సత్కరించారు. వీరిద్దరూ ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు కావడం ఆనందంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో ఇండియా మాజీ కోచ్ సన్నిబాబు, జాతీయ క్రీడాకారుడు సన్యాసిరావు, జాతీయ క్రీడాకారుడు శంకర్రావు, ఇతర సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. క్లబ్ కార్యదర్శి విజేతలను అభినందించారు.

సమరోత్సాహం

బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

- కేడర్‌ను ఉత్సాహ పరిచిన జగన్
- ప్రజలే నా ధైర్యం... సంక్షేమమే విధానం..
- పార్టీని భుజాన వేసుకున్న వారికి ఎప్పుడూ ప్రాధాన్యం
- సంగివలస 'సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి
- తరలివెళ్లిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'75ఏళ్ల వయసు మళ్లిన చంద్రబాబు మాదిరిగా నేను పొత్తుల కోసం దత్తపుత్రుడు, ఇతరుల వెంట వెంపర్లాడను. ప్రజలే నా ధైర్యం.. సంక్షేమం, అభివృద్ధి పథకాలే నా విధానం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. భీమిలిలో సంగివలస వద్ద శనివారం వైసిపి ఏర్పాటు చేసిన 'సిద్ధం' బహిరంగ సభకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజయనగరం జిల్లా నుంచి వందలాది వాహనాలు, బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సభలో కేడర్‌కు జగన్ 2024 ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ విపక్షాలపై విరుచుకుపడుతూ పార్టీ కేడర్‌లో ఎన్నికల సమరోత్సాహాన్ని నింపారు. వేల సంఖ్యలో పార్టీ కేడర్ తరలిరావడంతో భీమిలిలో ఇవాళ తనకు అటు సముద్రం, ఇటు జనసముద్రం కనిపిస్తుందని వ్యాఖ్యానించారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరిలోనూ ఒక్కో సేనాధిపతి కనిపిస్తున్నారని, ఇటు పక్క పాండవ సైన్యం ఉంటే అటుపక్క కౌరవ సైన్యం ఉందని ఈ యుద్ధంలో చంద్రబాబు సహా ప్రతి ఒక్కరూ ఓడిపోక తప్పదంటూ వ్యాఖ్యానించారు. పద్మవ్యూహంలో చిక్కుకోడానికి తాను అభిమన్యుడ్ని కాదని అర్జునుడినని చెప్పారు. ఈ అర్జునుడికి శ్రీకృష్ణుడిలా ప్రజలు తోడున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి 175కి 175 అసెంబ్లీ సీట్లు రావడం ఖాయమన్నారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీచేసే ధైర్యం ఏనాడూ లేదని, ఈ సారి తన దత్తపుత్రుడ్ని తోడుతెచ్చుకున్నారని, 2019 ఎన్నికల్లో వచ్చిన 23 సీట్లు కూడా వారికి రావని అన్నారు. చంద్రబాబు చెప్పుకోడానికి ఏమీలేదని, తాను చెప్పడానికి 4ఏళ్లలో రూ.లక్షల కోట్లు ప్రజలకు బటన్ నొక్కి అకౌంట్లలో సంక్షేమం అందించామన్నారు. 2019 వరకూ ప్రజల అకౌంట్లలో ఏమీ పడలేదని, తాను అధికారంలోకి వచ్చాక ఈ పెద్ద మార్పు జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక లాభ, నష్టాల లెక్కను చూడకుండా సంక్షేమం ఇచ్చానన్నారు. పాలనలో జగన్ మార్క్ ఉందని, బాబు పాలన చెప్పుకోడానికి ఏమీలేదని అన్నారు. అప్పట్లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 650 హామీల్లో 10శాతం కూడా అమలుచేయకుండా అన్నిటినీ అటకెక్కించేశాడని విమర్శించారు. హామీలు అటకెక్కించిన బాబు ఇంకా బతికే ఉన్నాడని ప్రజలకు వివరించాల్సిందిగా కేడర్‌కు జగన్ దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సిపి జగన్‌ది కాదని కేడర్‌దని వారిలో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. వాలంటీర్లు మనలోంచి వచ్చిన మనవాళ్లేనని బయటవారు కాదని అన్నారు. 2019 నుంచి 99శాతం హామీలను అమలు చేశామన్నారు.

వచ్చే 70 రోజులూ నిత్యం యుద్ధమే..

వచ్చే 70 రోజులూ నిత్యం యుద్ధమేనని, మీరంతా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రతిపక్షాలపై యుద్ధ బాణాలుగా మారాలి' అని ఎన్నికల నగారా మోగించారు. టిడిపి, జనసేన కలిసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచార ఆయుధాలతో దాడికి వస్తున్నారని, ఒంటరిగా ఎదుర్కొనడానికి తాను సిద్ధమని, మీరూ సిద్ధమేనా.. అలా అయితే దిక్కులు పిక్కటిల్లేలాగ సమరనాదం చేయండి అంటూ జగన్ అన్నారు. ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ తన పాలనలో సంక్షేమం అందిందని, 60 శాతం ప్రజలు తమతోనే ఉన్నారని, ప్రతి ఇంటి నుంచీ ఒక స్టార్ క్యాంపెయినర్ వైసిపి కోసం వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎన్నికలకు నేను సిద్ధం..మీరు సిద్ధమా అంటూ పదేపదే హాజరైన వారితో చప్పట్లు కొట్టించారు. ఉత్తకుండకు అరుపులెక్కువ.. చేతగానివాళ్లకు మాటలెక్కువ అనేలా ప్రతిపక్షాలున్నాయన్నారు. రాగల ఎన్నికలు పేదరికం నుంచి ప్రజలను బయటకు తెచ్చేవని, చదువుకునే పిల్లల తలరాతలు మార్చేవని అన్నారు.

వేదికపై రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, సీదిరి అప్పలరాజు, వైసిపి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఉత్తరాంధ్రకు చెందిన అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు, ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కులగణన వేగవంతం

- పది రోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
- పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు సిద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కులగణన ప్రక్రియను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం కూడా జిల్లాలో కులగణన నిర్వహించాలని స్పష్టం చేశారు. వివిధ మండలాల ఎంపిడిఒలు, తాహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కుల గణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, పేదల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కులగణనలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇప్పటికే 80 శాతం ఇళ్లకు వెళ్లినప్పటికీ 70 శాతం మంది వివరాలను మాత్రమే నమోదు చేశారని చెప్పారు. అన్ని కుటుంబాల్లో సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేసి, బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఆదివారం కూడా పనిచేసి, వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పదిరోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను వారి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. ప్రతీ సచివాలయం పరిధిలో రోజుకు కనీసం 50 కార్డులను పంపిణీ చేయాలని, మొత్తం పంపిణీ ప్రక్రియ 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాకు 5.39 లక్షల కార్డులు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 4.11 లక్షల కార్డులు వచ్చాయని, మిగిలినవి కూడా కొద్ది రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని తెలిపారు. ఇంటింటికీ వెళ్లే సమయంలో దిశ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ జిల్లాలో చాలా నెమ్మదిగా జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 9,700 ఎకరాలను గుర్తించినప్పటికీ, వాటికి సంబంధించి తహశీల్దార్లనుంచి పూర్తిస్థాయిలో నివేదికలు అందడంలో చాలా ఆలస్యం అవుతోందని చెప్పారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రిజిష్టర్ చేసేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 61,927 ఇళ్ల పట్టాలను రిజిష్టర్ చేయించాల్సి ఉందని తేలిందని, వాటికి సరిహద్దులను నమోదు చేసి, మ్యాపింగ్ చేసి, ఇతర వివరాలను సిద్ధం చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.

డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛన్ కానుక, ఆసరా, చేయూత ప్రభుత్వ పథకాలకు సంబంధించి వాలంటీర్ల నుంచి టెస్ట్ మోనీలు చేరాల్సిన గడువు ఇప్పటికే ముగిసిందని చెప్పారు. వాటిని ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి, ప్రతీ మండలం నుంచి ఒక్కో అంశానికి రెండు చొప్పున, ఈ నెల 30 లోగా జిల్లా స్థాయికి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీ వాటిని పరిశీలించి, ఉత్తమంగా ఉన్నవాటిని ఎంపిక చేస్తుందని చెప్పారు. మండల స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన వాటినికి రూ.15వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వాలంటీర్లకు సన్మానం జరిగే ఫిబ్రవరి 4న ఈ బహుమతి ప్రదానం ఉంటుందని పీడీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, మెప్మా పిడి సుధాకరరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిపిఒ శ్రీధర్ రాజా, డిఎల్‌డిఒ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులన్నీ వైసిపి బహిరంగ సభకు తరలింపు

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సార్వత్రిక ఎన్నిల సమర శంఖారావం మోగించేందుకు 'సిద్ధం' పేరిట ముఖ్యమంత్రి జగన్ విశాఖ జిల్లా భీమిలి మండలం సంగివలస సమీపంలో శనివారం వైసిపి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఆర్‌టిసి బస్సులన్నింటినీ తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు జిల్లాల్లోని విజయనగరం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, డిపోల నుంచి 235 బస్సులను సభకు కేటాయించినట్టు సమాచారం. ఈ సభకు నాయకులను, కార్యకర్తలను తరలించేందుకు ప్రతిమండలానికి ఆర్‌టిసి బస్సులను పంపించింది. విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి 100 ఆర్టీసి బస్సులు, పార్వతీపుం డిపో నుంచి 55, పాలకొండ డిపో నుంచి 45, సాలూరు డిపో నుంచి 35 బస్సులను వైసిపి సభకు కేటాయించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి అత్యధిక బస్సులను కార్యకర్తలను తరలించేందుకు వినియోగించడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులంతా ఆర్‌టిసి బస్టాండ్లలో గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పటికీ బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. అసలే అరకొర తిరిగే గ్రామీణ ప్రాంతాల బస్సులను ఇలా సభలకు తరలించడమేంటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అన్ని డిపోల నుంచి సభకు బస్సులను తరలించడంతో గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. విద్యార్థులు బస్సులు లేక స్కూల్స్, కాలేజీలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడ్డారు.

బస్సులు లేక వెలవెలబోతున్న ఆర్‌టిసి కాంప్లెక్సు

ప్రజలకు మంత్రి బొత్స ద్రోహం

- టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున
- ఆర్ఇసిఎస్ వద్ద నిరసన

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఆర్ఇసిఎస్‌ను బోర్డులో విలీనం చేసి చీపురుపల్లి ప్రజలకు రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ ద్రోహ చేసారని విజయనగరం పార్లమెంట్ స్థానం టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. రెస్కో విలీనానికి వ్యతిరేకంగా శనివారం స్థానిక ఆర్ఇసియస్ కార్యాలయం వద్ద నాగార్జున ఆధ్వర్యంలో ప్లకార్డులతో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. చేసారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 40 ఏళ్ల నుండి ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు విద్యుత్ సేవలందిస్తున్న ఆర్ఇసియస్‌ని ఎపిఇపిడిసియల్ సంస్థలో ఎవరి ప్రయోజనాలకోసం విలీనం చేస్తున్నారని ప్రశ్నించారు. రెస్కో విలీనం అవ్వలేదంటూనే ఎపిఇపిడిసియల్ పేరు మీద ప్రజలకు, రైతులకు బిల్లులు ఎలా వస్తున్నాయని నాగార్జున ప్రశ్నించారు. అంతే గాకుండా బోర్డు పేరుతో వస్తున్న బిల్లులు అధిక మొత్తంలో ప్రజలనుండి ఎందుకు వసూలు చేస్తున్నారని అన్నారు. మంత్రి తలచుకుంటే ఆర్ఇసియస్ సంస్థను బోర్డులో కలపకుండా చేయలేరా అని నాగార్జున ప్రశ్నించారు. హుటాహుటిన ఎనర్జీ అసిస్టెంట్లకు సంబంధించి సర్వీసు రిజిస్టార్‌ను ఎందుకు ఓపెన్ చేసారో తెలపాలని ఆయన కోరారు. ఆర్ఇసియస్‌లో దొంగ సర్టిఫికేట్లతో 59 మందిని ఎనర్జీ అసిస్టెంట్‌లుగా నియమించడంలో భారీగా అవినీతి జరిగిందని మీ పార్టీ ఎంపి బెల్లాన చంద్రశేఖరే స్వయంగా పార్టీ అధిష్టాన నాయకులను నిలదీసారని నాగార్జున గుర్తు చేసారు. ఎనర్జీ అసిస్టెంట్‌ల నియామకాలు పొందిన వారి సర్టిఫికేట్‌లు లక్నోలోని పండిట్ మదన్ మోహన్ మాలవ్య విద్యాపీఠ్ నుండి వచ్చిన వాటికి, తమకు ఎటువంటి సంబంధం లేదని ఆ సంస్థ విజిలెన్స్ అధికారులకు రాత పూర్వకంగా ఇచ్చారని అన్నారు. ఇలాంటి దొంగ సర్టిఫికేట్లుతో ఉద్యోగాలలో చేరిన వారిని ఏవిధంగా రెగ్యులర్ చేయాలని అధికార పార్టీ నాయకులు చూస్తున్నారనిప్రశ్నించారు. జూనియర్ లైన్‌మెన్లు తమ హక్కులకోసం న్యాయమైన పోరాటం చేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని నాగార్జున కోరారు. కార్య క్రమంలో చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడు, టిడిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైల బలరాం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దన్నాన రామచంద్రుడు, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లు రమణ, మెరకముడిదాం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కెంగువ ధనుంజయతో పాటు నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కోండ్రుకు వ్యతిరేకంగా కళా సమావేశం

- నాలుగు మండలాల నాయకులతో చర్చలు
- టిడిపి రాష్ట్ర పరిశీలకులకు నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-రేగిడి

రాజాం నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీకి గ్రూపుల పోరు తప్పేటట్టు లేదు. మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కొండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావుతో పాటు ఆయన గ్రూపీయులు రాజాంలోని కళా వెంకట్రావు ఇంట్లో శుక్ర, శనివారాల్లో రహస్యంగా సమావేశం అయ్యారు. రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మాజీ ఎంపిపిలు, కిమిడి రామకృష్ణం నాయుడు, కోళ్ల అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, రాజాంకు చెందిన కేశవరావు, గోవిందరావు మరి కొంతమంది ముఖ్య నాయకులతో రాష్ట్ర టిడిపి పరిశీలకుడు దామచర్ల సాయి సమక్షంలో ఈ సమావేశం జరిగింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం టిడిపి టికెట్ కోండ్రు మురళికి ఇస్తే వ్యతిరేకంగా పనిచేస్తామని నాలుగు మండలాల టిడిపి నాయకులు ఖరాఖండిగా చెప్పినట్లు తెలిసింది.

నియోజకవర్గంలో కోండ్రుకు వ్యతిరేకంగా ప్రజలు, నాయకులు ఉన్నారని నాయకులు ప్రస్తావించినట్లు తెలిసింది. కోండ్రు కాకుండా కొత్తవారికి టికెట్ ఇస్తే గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. రాజాం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వేషన్ కావడంతో ఈ నియోజకవర్గ సుపరిచితులు, పాలకొండ వాస్తవ్యులు, రేగిడి మండల ఉపాధ్యాయురాలు స్వర్ణ రాణికి టిడిపి అధిష్టానం బి. ఫారం కేటాయిస్తే గెలుపునకు కృషి చేస్తామని చెప్పినట్లు తెలిసింది. బిసి సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళా వెంకట్రావు, అతని సోదరుడు రామకృష్ణం నాయుడు కుటుంబంతో పాటు బంధుత్వం ఉన్న నాయకులను కాదని అధిష్టానం ధిక్కరిస్తే టిడిపి భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అన్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాజాం నియోజకవర్గంపై దృష్టి సారించి కోండ్రు, కళా వెంకట్రావు, మాజీ స్పీకర్ ప్రతిభా భారతితో చర్చలు జరిపితే గాని సమస్య పరిష్కారమయ్యేలా లేదని టిడిపి నాయకులు, కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు.

రాష్ట్ర పరిశీలకుడికి అభ్యర్థి మార్పు గురించి వివరిస్తున్న టిడిపి నాయకులు

పని భద్రత కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు పని భద్రత కల్పించాలని కోరుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిన్నారావు, కార్యదర్శి సురేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గొండేల ప్రకాష్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్లకు ఏడాది ఆరు నెలలు మాత్రమే పని దొరుకుతుందని, మిగతా రోజుల్లో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వృత్తి భద్రత లేకపోవడం వల్ల వేరే వృత్తులకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్ఒకు వినతి అందజేశారు.

బొబ్బిలి: ఎలక్ట్రికల్ కార్మికులను ఆదుకోవాలని ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జె. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎలక్ట్రిషియన్ దినోత్సవం సందర్భంగా శనివారం జెండాను ఎగుర వేసి ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్లు

ఉద్యోగ కల్పనలో దొందూ దొందే

ప్రజాశకి - విజయనగరం ప్రతినిధి

ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందుగానే వ్యవహరిస్తున్నాయనే వాదన జనం నోట చర్చ నీయాశమౌంతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కోసం ఎదురు చూసి మోసపోయిన నిరుద్యోగులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పాలకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ మోడీ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. తనకు ఒక్క అవకాశం కల్పిస్తే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగావున్న పోస్టులన్నీ భర్తీ చేస్తానని, ఇందుకోసం ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ విధితమే. దీంతో, జనం జగన్‌కు పూర్తి మెజార్టీ ఇచ్చారు. కానీ, జాబ్ క్యాలెండర్ కాదు సరికదా కనీసం ఖాళీ అవుతున్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. డిఎస్‌సి విడుదల చేయలేదు. కొత్తగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదు. కేంద్రం అమలు చేస్తున్న నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలల విలీనం పేరుతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వందలాది స్కూళ్లను ఎత్తివేశారు. దీంతో ఆమేరకు ఉపాధ్యాయ పోస్టులు గల్లంతయ్యాయి. మెగా డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులు విజయనగరంలో ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి కోటజంక్షన్ వరకు భారీ ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. విద్య వ్యాపారమయంగా మారిన నేపథ్యంలో

బిఇడి, టిటిసి వంటివి పూర్తిచేయడం, ఆ తరువాత డిఎస్సీ క్వాలిఫై కావడం అంటే మాటలు కాదు. సమయంతోపాటు ఫీజుల రూపంలో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి ఉంది. వైసిపి అధికారంలోకి సచివాలయ ఉద్యోగాలు మినహా ఒక్క శాఖల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎక్కువ మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ ఊసే లేదు. కేంద్ర విద్యా శాఖ మంత్రి మన రాష్ట్రంలో 50వేల పోస్టులు ఖాళీలున్నాయని పార్లమెంట్‌లో ప్రకటిస్తే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 714పోస్టులు మాత్రమే అంటూ ఒకరోజు, ఎనిమిది వేల పోస్టులు అని మరో రోజు.... రోజుకో రకంగా చేస్తున్న ప్రకటనలు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఈ నేపథ్యంలోనే చదువుకున్న యువత ఉపాధి పనులు చేయడం, వలసకూలీలుగా మారడం వంటివి పెరిగాయి. కనీసం స్వయం ఉపాధి పొందదామంటే ప్రభుత్వం నుంచి అటువంటి సహకారం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్ -2 పోస్టులు కూడా గడిచిన ఐదేళ్లగా తీయకపోవడం వల్ల సాక్షాత్తు మండల, జిల్లా స్థాయి అధికార పోస్టులు కూడా అంతకన్నా తక్కువస్థాయి గల అధికారులతో నింపారు. మన రెండు జిల్లాల్లో సగానికి సగం మంది దిగువ స్థాయి అధికారులతోనే జిల్లా స్థాయి పనులు చేయిస్తుండడం సర్కారు తీరుకు నిలువెత్తు నిదర్శనమని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బంగారు బాతులాంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (విశాఖ స్టీల్‌ప్లాంట్)ను విదేశీ ప్రైవేటు సంస్థలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండడంతో ఇందులోని ఉద్యోగాలకు భద్రత ఉండే పరిస్థితి లేదు. దీంతో కొత్తగా ఉద్యోగాలు వచ్చేందుకు కూడా అవకాశాలు తగ్గిపోతాయి. ఈనేపథ్యంలో నిరుద్యోగులు, యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ మోసం చేసిన ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 24 నుంచి జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర నియోజక వర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు నగర పంచాయతీ పరిధి థామస్ పేట ఫుట్ బాల్ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో విజేతలకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, మండల ప్రత్యేకాధికారి వి.శ్రీనివాస్, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, ఎంపిడిఒ జి.రామారావు చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ పోటీల్లో పురుషుల కబడ్డీ విజేతల నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటి రేగ జట్టులు వరుస స్థానాల్లో నిలిచాయి. స్త్రీలు కబడ్డీ విజేతలుగా నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటి రేగ జట్టులు వరుస స్థానాల్లో నిలిచాయి. పురుషులు ఖో-ఖో విజేతలుగా పూసపాటి రేగ, భోగాపురం, నెల్లిమర్ల, స్త్రీలు ఖో-ఖో విజేతలుగా నెల్లిమర్ల, పూసపాటి రేగ, భోగాపురం జట్టు విజయం సాధించాయి. పురుషులు బ్యాడ్మింటన్ విజేతలుగా నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, స్త్రీలు బ్యాడ్మింటన్ విజేతలు డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం, పురుషులు వాలీబాల్ విజేతలుగా భోగాపురం, పూసపాటి రేగ, నెల్లిమర్ల, స్త్రీలు వాలీబాల్ విజేతలు భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, పురుషులు క్రికెట్ విజేతలు పూసపాటి రేగ, భోగాపురం, డెంకాడ జట్లు వరుస స్థానాల్లో విజయం సాధించాయి. నియోజకవర్గ స్థాయిలో విజేతలకు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో క్రీడలకు ప్రథమ బహుమతిగా జట్టుకు రూ. 35వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు తృతీయ బహుమతిగా 5వేలు అందించారు. బాడ్మింటన్‌కి రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఈపు విజయ్ కుమార్, యుఎస్ఎన్ మూర్తి, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, నెల్లిమర్ల నియోజక వర్గస్థాయిలో పీడీలు, పిఇటిలు నగర పంచాయతీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విజేతలకు బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్

హోరాహోరీగా పోటీలు

శృంగవరపుకోట: ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం జరిగిన మహిళల బ్యాడ్మింటన్ పోటీలను ఎస్‌కోట ఎంపిడిఒ శేషుబాబు, ఎంఇఒ బి. నర్సింగ్‌రావులు శనివారం ప్రారంభించారు. ఐదు మండలాల మధ్య పోటీలు హోరా హోరీగా సాగాయి. చివరకు బ్యాడ్మింటన్‌లో ఎస్ కోట ప్రథమ స్థానంలోనూ, వేపాడ ద్వితీయ స్థానం, ఎల్.కోట తృతీయ స్థానం సాధించాయని మండల కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. డాక్టర్ వరలక్ష్మి సీబీఎస్సీ పాఠశాల క్రీడామైదానంలో మహిళల కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలు నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ కె. కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో వాలీబాల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో కొత్తవలస, ఎస్.కోటలు నిలిచాయి. కోకో విభాగంలో కొత్తవలస, ఎస్ కోట ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయని, కబడ్డి ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలసలు వరుస స్థానాల్లో నిలిచాయని శ్రీరాములు తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం పురుషుల క్రికెట్ పోటీలు ఉదయం9 గంటలకు గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాల ఎస్‌కోట క్రీడా మైదానంలో ప్రారంభమవుతాయని, పురుషుల కబడ్డీ సెమీఫైనల్స్ ఫైనల్స్ ఆదివారం ఉదయం డాక్టర్ వరలక్ష్మి సీబీఎస్సీ పాఠశాలలో జరుగుతాయని శ్రీరాములు తెలిపారు.

దోసెలేస్తున్న అదితిగజపతిరాజు

దోసెలేసిన అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం టిడిపి విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితిగజపతి 19, 18వ డివిజన్‌లైన లంకాపట్నం, హుకుంపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. టిఫిన్ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న మహిళ వద్దకు వెళ్లి దోసెలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్‌పిగా పోటీకి సిద్ధం

విద్యావేత్త గంటా అప్పలనాయుడు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయంగా సేవ చేసుకోవడానికి అవకాశమిస్తే విజయనగరం ఎంపిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని విద్యావేత్త గంటా అప్పలనాయుడు తెలిపారు. రానున్న ఎన్నికలు నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యా, రాజకీయం, సంక్షేమంపై అవగాహన ఉన్న తాను ఈ ప్రాంతం ఎంపిగా పోటీ చేసి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఉందన్నారు. రాజకీయపార్టీ ప్లాట్‌పాం ద్వారా తన సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ఎన్నికల్లోకి రానున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధిగా ఎన్నికవడానికి సామర్థ్యం తనకున్నాయన్నారు. ఆర్థిక, సామాజిక, సేవా, రాజకీయ అనుభవం ఉన్న తన లాంటి వారిని రాజకీయాల్లోకి రావాలని స్నేహితులు, మేధావులు, బంధువులు, తమ సామాజికవర్గం కోరుతుందన్నారు. విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని లోచర్ల తమ స్వగ్రామమని, కొప్పల వెలమ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లాలో బొబ్బిలి, గజపతినగరం, ఎస్. కోట, రాజాం, విజయనగరం నియోజకవర్గాల్లో తమ సామాజిక వర్గం ప్రధానంగా ఉందన్నారు. ఉన్నత విద్యావంతుడునైన తాను విశ్వసనీయతతో విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలో ప్రజలకు సుపరిచితుడునని చెప్పారు. బొబ్బిలి లోక్‌సభ, పునర్విభజన తర్వాత విజయనగరం పార్లమెంటరీకి ఇప్పటి వరకూ ఇంత పెద్ద సామాజిక వర్గంగా ఉన్న కొప్పల వెలమకు సీటు కేటాయించలేదన్నారు. రెండు దశాబ్ధాలు పాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్సియల్ కార్పొరేషన్‌కు సేవలందించానన్నారు. బాల్యం నుండి తనకు సామాజిక, స్వచ్ఛంద సేవకు పునాది పడిందన్నారు. జన విజ్ఞానం, బహిరంగ సభలో పాల్గొని నిరంతరం ప్రజల్లో ఉన్నానన్నారు. నీతి, నిజాయితీతో పాటు టీమ్ వర్కుపై అపార అనుభవం ఉన్న తనకు అవకాశం వస్తే మరింతగా ప్రజా సేవ చేస్తానన్నారు. సూత్రాలు, విధానాలు ఆధారంగా 43 సంవత్సరాలు వయస్సులోనే మేనేజ్‌మెంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా సేవలో ఉన్నానన్న సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. దాదాపుగా ఆరు సంవత్సరాలు పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వినియోగదారుల ఫోరమ్ పూర్తికాల సభ్యునిగా (సబ్- జడ్జి) ర్యాంక్‌లో పనిచేశానని గుర్తు చేశారు. శ్రీ సాయి కళానికేతన్ చైర్మన్‌గా 9 నంది అవార్డులు, ఇతర ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందామన్నారు. 1999లో కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా తెర్లాం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా తన పేరు ప్రకటించిన సమయంలో కొన్ని రాజకీయ శక్తులు అడ్డుకున్నాయన్నారు. తాను ప్రజల మీద బతికే నాయకుడిగా కాకుండా ప్రజల కోసం బతికే సేవకుడిగా ఉండాలన్నదే తన ఆశయమని చెప్పారు.

అరుదైన 'గౌర'వం

రిపబ్లిక్‌డే పరేడ్‌లో ముగడ యువతి

ప్రజాశక్తి-బాడంగి

దేశ గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాహస విన్యాసాలు, కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కొందరికే లభిస్తుంది. అలాంటి అవకాశం ఒకసారి రావడమే గగనం. అలాంటిది రెండుసార్లు రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కడం చాలా అరుదు. కానీ, అలాంటి అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది ముగడ గ్రామానికి చెందిన తెంటు గౌరీశ్వరి. కేరళలో సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ (సిటి)గా విధులు నిర్వహిస్తున్న గౌరీశ్వరి.. న్యూఢిల్లీలో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సిఆర్‌పిఎఫ్ మహిళల బృందం నిర్వహించిన మార్చ్‌లో భాగస్వామ్యమైంది. గతేడాది రిపబ్లిక్‌డే వేడుకల్లో మార్చ్ నిర్వహించిన సిఆర్‌పిఎఫ్ బృందంలోనూ ఆమె ఉన్నారు. వరుసగా రెండో ఏడాది మార్చ్‌లో పాల్గొన్నారు. సాధారణంగా మహిళలు భద్రతా బలగాల్లో చేరడం అరుదు. ముగడ గ్రామం నుంచి త్రివిధ దళాల్లో అనేక మంది పురుషులు పనిచేస్తున్నారు. కానీ యువతి గౌరీశ్వరి ఒక్కరే భద్రతా బలగాల్లో (సిఆర్‌పిఎఫ్)లో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. తమ గ్రామానికి చెందిన యువతి గౌరీశ్వరి రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడం పట్ల గ్రామస్తులతోపాటు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ గౌరీశ్వరి

'తూర్పుకాపు'కు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు చంద్రమోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తూర్పుకాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, తూర్పు కాపు ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు తూర్పు కాపులకే కేటాయించాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ డిమాండ్ చేసారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మయూరి కూడలి వద్ద చేపట్టిన ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమంలో చంద్రమోహన్ మాట్లాడారు. తూర్పుకాపులను బిసి-డి నుండి బిసి-ఎ లోకి చేర్చాలని, 7శాతం ఉన్న రిజర్వేషన్ ను 12 శాతానికి పెంచి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేసారు. ఇప్పటివరకు పదవులు అనుభవించిన తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలెవరూ తూర్పు కాపులకు న్యాయం చెయ్యలేదని విమర్శించారు. తూర్పు కాపులు ఏ ప్రాంతంలో నివసిస్తున్నా వారికి ఒబిసి స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలన్నీ తూర్పుకాపు సామాజిక వర్గ ఓటర్లను దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, లేని పక్షంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


ఆత్మగౌరవ దీక్షలో పాల్గొన్న తూర్పు కాపు నాయకులు

ఆత్మగౌరవ దీక్షకు జనసేన పిఎసి సభ్యులు పడాలఅరుణ, వైసిపి నాయకులు పిళ్లా విజయకుమార్ తో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం విజయనగర నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన సంతోష్ కుమార్ నాయుడు, సంఘ నాయకులు రాజారావు, మురళీ, బెల్లాన శివశంకర్ ఇతర తూర్పు కాపు నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి పసుపాం మాజీ సర్పంచ్

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని పసుపాం మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు కంది వెంకటరమణ శనివారం ఐదుగురు వార్డు సభ్యులు సహా 100 కుటుంబాలతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు అధ్వర్యంలో మాజీమంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు సమక్షంలో నెల్లిమర్ల ఇంచార్జి కర్రోతు బంగారాజు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి వెళ్లిన మాజీ సర్పంచ్ కంది వెంకటరమణ మాట్లాడుతూ టిడిపితోనే ఈ రాష్ట్రానికి ప్రజలకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకంతో వైసిపిని వీడి టిడిపిలోకి వెళ్తున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు బండారు రమణమ్మ, పతివాడ కనకరత్నం, చింతపల్లి అప్పయ్యమ్మ, లెంక నారాయణప్పడు, వాళ్లే చిన్నం నాయుడులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మునాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరావు, నాయకులు పతివాడ అప్పల నారాయణ, కర్రోతు సత్యనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు, విక్రం జగన్నాదం, పిన్నింటి సన్యాసినాయుడు, పసుపులేటి గోపి, వెంపడాపు సూర్యనారాయణ, ఇజ్జురోతు ఈశ్వర్రావు, పిన్నింటి శ్రీనివాసరావు, గేదెల రాజారావు, మాజీ సర్పంచ్ తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కర్రోతు, పతివాడ

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం మండలంలోని గోపాలపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో, గోపాలపల్లి, సీతారాంపురం పంచాయతీల పరిధికి సంబంధించి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత శిబిరాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోకి వైద్య సిబ్బందిని పంపించి వివిధ రకాల వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలు మండలాల్లో, ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరైన రోగులతో ఆయన మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, స్థానిక సర్పంచ్ అడారి మహేశ్వరరావు, ఎంపిటిసి గుమ్మడి సన్యాసప్పడు, వార్డు మెంబర్లు రంధి గణేష్, అడారి సూరిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, మామిడిపల్లి మాజీ సర్పంచ్ రమణ, నాయకులు రేవళ్ళపాలెం రామకృష్ణ, చుక్క గణేష్, ఎమ్.కృష్ణ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బికెఎన్‌పేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని జిల్లా కోఆర్డినేటర్ టి. పద్మజ శనివారం ఆకస్మిక పరిశీలన చేశారు. ముందుగా వసతి గృహానికి సంబంధించిన వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం బాలికలకు ఇస్తున్న మెనూ పరిశీలించి రుచిని చూశారు. ఎఫ్ఎ-3 పరీక్షలను పరిశీలించి 10, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రధాన పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉందని మిగిలిన 40 రోజులను సద్వినియోగం చేసుకొని శత శాతం ఫలితాలు సాధించడంతో పాటు ప్రథమ స్థానాన్ని ప్రతి ఒక్కరూ సాధించగలిగే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి సబ్జెక్టు పైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యంగా మ్యాథమెటిక్స్ షార్ట్ మెథడ్స్ ఫాలో అయితే ఎక్కువ మార్కులు సాధించవచ్చని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్ హాఫ్ ఇయర్లీ రిజల్ట్ మీద 10వతరగతి స్టడీ ఎస్ఎ 1 రిజల్ట్ మీద ఆరా తీశారు. శాతం రిజల్ట్ వచ్చే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం ప్రిన్సిపల్ ఫ్లోరిన్సీ, ఇన్చార్జి ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

మండలంలోని వీలుపర్తి ఎయిడెడ్ పాఠశాలను వెల్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు శనివారం పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. యూనిఫారంతో పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు.

రాజన్నదొర చేసింది శూన్యం : టిడిపి

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల మినీ రిజర్వాయర్‌ను ప్రారంభించి 70 శాతం పనులు పూర్తి చేసింది టిడిపి ప్రభుత్వమేనని నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, మంత్రిగా వున్న రాజన్న దొర ఏమి చేశారో చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించారు. నియోజకవర్గానికి రాజన్నదొర, వైసిపి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. మండలంలోని గుర్ల గ్రామంలో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నది టిడిపి ప్రభుత్వమేనని గుర్ల రిజర్వాయర్ పూర్తి చేసి రైతులకు కానుకగా ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి నుంచి టిడిపికి అనేక మంది క్యూ కడుతున్నారని, ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం వైసిపి నుంచి 50 కుటుంబాలు ఆమె సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు రెడ్డి ఆదినారాయణ, రెడ్డి పార్వతి, సరకాన రాము నాయుడు, చిన్నం నాయుడు, వెంకన్న, తాడ్డి తిరుపతి, తాడ్డి గోవింద్, డీలర్ సత్యం, డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు గురించి వివరిస్తున్న సంధ్యారాణి

ఓటు వేసి నియోజకవర్గాన్ని రక్షించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రతి ఒక్క యువ ఓటర్ ఓటు వేసి 2024లో నియోజకవర్గాన్ని రక్షించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కోరారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని కొత్త ఓటర్లుతో ఆయన బేటి అయ్యారు. అనంతరం గొంప కృష్ణ మాట్లాడుతూ మీరు వేసే ఓటు మీ వ్యక్తిగత జీవితాన్ని శాసిస్తుందని గుర్తించుకోవాలన్నారు. ప్రజాధనాన్ని దోచుకుతింటున్న వైసిపిని తిప్పికొట్టి, నిజమైన పాలన అందించే సత్తా ఉన్నవారికే ఓటు వేయాలని కోరారు. నేరచరితులు, భూకబ్జాదారులు ఎన్నికల్లో పోటీచేస్తూ కోట్లు వెదజల్లుతుండటం, మంచి రాజకీయాన్ని ఎదగనీయకుండా చేసేందుకు బురదజల్లటం బాధకలిగిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్ని మార్చగలిగే అవకాశం, బాధ్యత పూర్తిగా మీ చేతుల్లోనే ఉందని, 'ఓటు' అనే ఆయుధం ద్వారానే మార్పును సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఆడారి ఉమామహేశ్వర రావు, గనివాడ సన్యాసినాయుడు, మాదిబోయిన మంగరాజు, మతల ఎర్రినాయుడు, బంగారు నాయుడు, ఇందుకూరి శ్రీనిరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువకులకు అవగాహన కల్పిస్తున్న గొంప కృష్ణ

విఆర్‌ఒను తొలగించాలి

ప్రజాశక్తి- బాడంగి

కోడూరు విఆర్‌ఒ రామకృష్ణను విధుల నుంచి తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. కోడూరు రెవెన్యూ రామచంద్రపురం దగ్గరలో ఉన్న ప్రభుత్వ చెరువులను కొంత మంది కబ్జా చేస్తున్నా విఆర్‌ఒ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని సురేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కబ్జాకు గురవుతున్న చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్ 110లో 6.57 ఎకరాలు, సర్వేనెంబర్ 117లో 7.57 ఎకరాలు ప్రభుత్వ చెరువులు ఉన్నప్పటికీ ఈ రెండు చెరువులు భూస్వామి కంచేసి తన భూమిలో కలుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నా సరే విఆర్‌ఒ పట్టించుకోలేదన్నారు. దీనిపై సిపిఎం ఇప్పటికే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిందని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన విఆర్‌ఒకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విఆర్‌ఒపై చర్యలు తీసుకోకపోతే సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చి చర్యలకు డిమాండ్ చేస్తామని చెప్పారు.

గన్నిశెట్టిపాలెంలో మెగా వైద్య శిబిరం

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెంలో శనివారం పాస్టర్ మనోహర్ కె. మహంతి, క్రైస్తవ ప్రార్థన మందిరం సబ్బవరం ఆధ్వర్యంలో ఆరోగ్య ఆశీర్వాద్ వైద్య బృందం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించాయి. ఈ శిబిరంలో 86 మందికి వైద్య పరీక్షలు చేసి పాస్టర్ రమేష్ చేతులు మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ రాణి, ఆత్మీయ తల్లీ జీవమ్మ, బిషప్ వరప్రసాద్, బిషప్. కిషోర్, సంఘ పెద్దలు సువర్ణరాజు, స్టీఫెన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బల్లంకిలో ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకిలో శ్రీ పైడిమాంబ జాతర సందర్భంగా ఆదివారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తామని గ్రామ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

14 మంది అరెస్టు

రేగిడి: మండలంలోని రెడ్డి పేట జంక్షన్ వద్ద మామిడి తోటలో 14 మంది పేకాట ఆడుతున్న వారిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5,360 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట గ్రామానికి చెందిన కోన శంకర్రావు శుక్రవారం సాయంత్రం బల్లంకి జాతరకు వెళ్లి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి బయట ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి పడుకుండిపోయాడు. రాత్రి 12 గంటల సమయంలో మంటలు చెలరేగి బండి పూర్తిగా దగ్ధమైంది. అయితే ద్విచక్ర వాహనం ఎలా కాలిపోయిందో తెలియని పరిస్థితి నెలకొంది. వల్లంపూడి ఎస్ఐ రాజేష్‌కి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంకరరావు తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో తనిఖీలు

తెర్లాం: స్థానిక పోలీసు స్టేషన్‌లో బొబ్బిలి సిఐ తిరుమలరావు శనివారి తనిఖీలు నిర్వహించారు. రానున్న కాలంలో ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో మండలంలో శాంతి భద్రతలు అదుపు చేయడం కోసం ముందు నుంచే ప్రణాళిక వేసుకుని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి భద్రత ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ మద్యం తరలింపు, మత్తు పదార్థాలు అరకట్టాలన్నారు. అనంతరం వెంగళవలస, కునాయవలస పోలింగ్ బూతులు పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్ఐ రమేష్ ఉన్నారు.

ఉత్తమ తహశీల్దార్‌కు సన్మానం

తెర్లాం: మండల తహశీల్దార్ రతన్ కుమార్ 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ తహశీల్దార్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం విధితమే. ఈ మేరకు మండల కార్యాలయ సిబ్బంది ఆయన్ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

తెర్లాం: మండలంలోని పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ఆదేశాల మేరకు 530 ఆరోగ్య శ్రీ కార్డులను, ఆయుష్మాన్ భవ కార్డులను శనివారం ఏఎన్ఎం జి భవాని, ఆశ వర్కర్లు పార్వతి, సువర్ణ, వాలంటీర్లు గ్రామాల్లో పంపిణీ చేశారు. వాటిని వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా సన్యాసి పాత్రుడు

కొత్తవలస: మేజర్ పంచాయతీ పరిధి పాత సుంకరపాలెం గ్రామానికి చెందిన కంబళ్ల సన్యాసి పాత్రుడు కాంగ్రెస్ పార్టీ కొత్తవలస మండల అధ్యక్షులుగా ఎంపికైనట్లు తెలిపారు. ఆయనకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సరిగిన రమేష్ కుమార్ జిల్లా పార్టీ కార్యాలయంలో ధ్రువ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలపై పోరాటం చేస్తూ వచ్చానని తనకు బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తప్పవు

రామభద్రపురం: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎసిఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. శనివారం పారాది వేగావతి నది నుంచి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న 5 ట్రాక్టర్లను ఆయన సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం ఇసుక, కంకర, మట్టి వంటి వాటికి అనుమతులు పొందకుండా రవాణా చేయడం చట్ట విరుద్ధమన్నారు. దాడుల్లో ఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

3న చలో ఢిల్లీ

బొబ్బిలి: జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని ఫిబ్రవరి 3న ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ధనుంజయరావు తెలిపారు. జాతీయ విద్యా విధానం జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ చేపట్టనున్న ఛలో ఢిల్లీను జయప్రదం చేయాలని కోరారు.

'షర్మిలపై విమర్శలు తగవు'

బొబ్బిలి: పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలపై ఎమ్మెల్యే శంబంగి విమర్శలు చేయడం తగదని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతో షర్మిలపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ పరువు తీస్తున్న వైసిపి పార్టీ అని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు షర్మిలను పార్టీ వినియోగించుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

నెల్లిమర్ల: ఈపిఎస్ పింఛనుదార్లకు కనీస పింఛన్ రూ.9వేలు అమలు చేయాలని ఈపిఎస్ పింఛనుదార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పల నారి డిమాండ్ చేశారు. శనివారం ఈపిఎస్ పింఛనుదార్లకు కనీస పింఛన్ రూ.9వేలు అమలు చేయాలని కోరుతూ జరజాపుపేటలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పలుమార్లు కనీస పెన్షన్ అమలు చేయాలని కేంద్ర మంత్రులు, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పనికిరాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో జరిగే మహాధర్నాను కార్మికులు, ఉద్యోగులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.సింహాచలం, జి.కృష్ణ, ఎం. రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాజుద్దీన్ బాబా జన్మదిన వేడుకలు

భోగాపురం: హజరత్ తాజుద్దీన్ బాబా 163వ జన్మదిన వేడుకలను శనివారం నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలిపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో పూజలు నిర్వహించి దాకమర్రి గ్రామం వద్ద ఉన్న తాజుద్దీన్ బాబా ఆశ్రమం వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచాతో బాబాను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర టిడిపి జోనల్ ఇంఛార్జ్ దామచర్ల సత్య, బొబ్బిలి నియోజకవర్గం టిడిపి ఇంఛార్జ్ బేబినాయన, రెడ్డిబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, ఇన్నాపురం నియోజకవర్గం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకరరావు, పల్లె భాస్కరరావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు, చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా కులగణన పూర్తి

రామభద్రపురం: గడువు తేదీలోగా శత శాతం కులగణన సర్వే పూర్తి అయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రమామణి ఆదేశించారు. ఇప్పటి వరకు 22పంచాయతీల్లో వాలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో కలిసి కులగణన సర్వే 90శాతం పూర్తి చేశారని, గడువు తేదీ ఈ నెల 29లోగా శత శాతం పూర్తికి పరస్పర సహకారం చేసుకొని పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 29న ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామని దీనికి ఎంపిటిసిలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, పిఎసిఎస్ అధ్యక్షులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కులగణన వైసిపి దురాలోచనకు నిదర్శనం

విజయనగరం టౌన్: కుల గణన చేపట్టడం వైసిపి దురాలోచనకు నిదర్శనమని జనసేన నాయకులు గురాన అయ్యలు మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న బిసి కులాల గణన కేవలం ఎన్నికల ఎత్తుగడగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ఆర్థిక అంశాలతో కులగణనను ముడిపెట్టకూడదన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేపట్టడంలో ప్రభుత్వ ఉద్దేశం అయితే ఆదాయం, భూముల వివరాలు, ఆస్తుల వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పాటివరకు రాజ్యాంగ వ్యతిరేకంగా కుల గణన పేరిట సర్వే చేపట్టడం సరైనది కాదన్నారు.

ఆసరా సభకు స్థల పరిశీలన

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ ఆసరా సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఎంపిడిఒ డి. సత్యవతమ్మ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో పాటు నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ పరిశీలనలో వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎన్. ఆనందయ్య, జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీనివాసరావు, ఎపిఎం ఆర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌టి సుజాత, వెంకటరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంగుడుబిల్లి మాజీ సర్పంచ్ మృతి

నెల్లిమర్ల: తంగుడుబిల్లి మాజీ సర్పంచ్ కురివినేని గురునాయుడు(85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయన తంగుడుబిల్లి గ్రామానికి రెండు సార్లు సర్పంచ్, ఎంపిటిసిగా సేవలందించారు. వన సంరక్షణ సమితి చైర్మన్‌గా పిఎసిఎస్ రామతీర్థం డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన మృతదేహం వద్ద పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు.

వంద రోజుల్లో ఆర్ఇఎస్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

టిడిపి అధికారంలోనికి వచ్చిన 100 రోజుల్లోనే తిరిగి ఆర్ఇఎస్‌ను పునరుద్ధరిస్తామని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు అన్నారు. స్థానిక నటరాజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతున్న ఆర్ఇఎస్‌ను అధికార వైసిపి పార్టీ బోర్డులో విలీనం చేయడం వలన ఈ ప్రాంత ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపిలో చేరిన తాను చంద్రబాబునాయుడు ఏ పని అప్పజెప్పినా ఆ పని చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి కాలువకు సంబంధించిన పిల్ల కాలువలను చెరువులకు అనుసంధానం చేసే బాధ్యత తీసుకొని రైతులకు సకాలంలో నీరందిస్తానని తెలిపారు.